


# పోలీస్ బాయ్

**కథ**

తెలిదేవర భానుమూర్తి

యాద్గిరి మా దోస్తు. గాడు మా ఊరోడే. మేమందరం ఒక్క బల్లెనే సద్వుకున్నం. గీనడ్మనే గాడు డిఎస్పి అయ్యిండు. డిఎస్పి అయిన కాడి నుంచి గాడు మమ్ములను గలుస్తలేడు. దోస్తులను గల్సెతందుకు గానికి పుర్సత్‌లేనట్లు గొడ్తున్నది. గాడు మమ్ములను గల్వకుంటె ఏంది గాన్నే మేము గలుద్దామనుకున్నం. ఒక దినం సత్నారి గాడు నేను గల్సి యాద్గిరి ఇంటికి బోయినం. గని గాడు ఇంట్ల లేడు. ఆపిస్‌కెల్లి ఇంక రాలేదని గాని పెండ్లాం జెప్పింది.

"ఆపిస్‌కే బోయి యాద్గిరిని గలుద్దాం రా" అని సత్నారి అన్నడు.

"మంచిది. యాద్గిరి ఆపిస్‌కే బోదాం పా " అని అన్న.

ఇద్దరం గల్సి యాద్గిరిగాని తాన్కి బోయినం. మమ్ములను సూడం గనే గాని మొకం చమ్కాయించింది.

"ఏందిరో తొవ్వదప్పి వొచ్చింద్రు" అని గాడు అన్నడు.

"తొవ్వదప్పి రాలేదు. తొవ్వబట్టుకోనే వొచ్చినం" అని సత్నారి అన్నడు.

"డిఎస్పి అయినంక ఈద్ కా చాంద్‌వైనవు" అని నేను అన్న.

"నాకు మిమ్ములను గల్వాలని ఉన్నా ఒక్క దినం గూడ పుర్సత్ లేకుంట ఉన్నది. ఏం జెయ్యమంటవురా?" అని యాద్గిరి అన్నడు.

"మాతోని ఎట్లన్న మాటముచ్చట లేదు. కమస్కం పెండ్లాపిల్లతోనైన మాట ముచ్చట ఉన్నదా? లేదా?" అని సత్నారి అడిగిండు.

"నేను ఆపీస్‌కెల్లి ఇంటకి బోయెతల్కె రాత్రి పదకొండో పన్నెండో గొడ్తది. పోరగాల్లు నిద్రల ఉంటరు. నా పెండ్లాం నిద్రమబ్బులనే గింత బువ్వ బెడ్తది. పొద్దుగాల్ల పదిగొట్టంగనే ఆపిస్కు వొస్త. ఇగ పెండ్లాం పిల్లలతోని ముచ్చట బెట్టెతందుకు మోక యాడ్ది. ఇంతకు మీరెట్ల ఉన్నరురా?" అని యాద్గిరి అడిగిండు.

"మేము బాగున్నం. ఇద్దరం ఒకటే ఆపిస్ల పనిజేస్తున్నం. ఇద్దరం ఒకే వాడకట్టుల ఉంటున్నం. ఐతారం వొస్తె పెండ్లాం పిల్లలను దీస్కోని ఇద్దరం గల్సి సిన్మకు బోతం" అని సత్నారి అన్నడు.

"మీ లెక్క పెండ్లా పిల్లలతోటి సిన్మకు బోయే అదృష్టం నాకు లేదురా. ఊల్లె మనం సద్వుకున్న దినాలు యాదికొస్తె నా మనసు కలకలమంటది" అని యాద్గిరి అన్నడు.

"అవ్ మల్ల గా దినాలు రమ్మనా రావు. సదువుకునే దినాలల్ల మనం చెర్ల ఈతలు గొట్టెటోల్లం. గోటీలు ఆడెటోల్లు. ఒకపారి గిల్లిదండ ఆడుతుండంగ గిల్లి వొచ్చి నా నెత్తికి దాకింది. నేను బేహోష్పైన. మీరిద్దరు పరేషాన్ అయ్యింద్రు" అని నేను అన్న.

"గా సంగతి నాగ్గూడ యాదికున్నది. నువ్వు బేహోష్‌గాంగనే నాకు బుగులైంది. గా దినాల మల్ల రమ్మంటె వొస్తయా? మనం ముగ్గురం గల్సి ఛాయ్ దాగి శాన దినాలైంది. ఛాయ్ దెప్పిస్త" అని యాద్గిరి "రాం చందర్. రాం చందర్" అని బిల్సిండు.

గాడు బిల్వంగనే ఒక సిఐ వొచ్చి కడక్ సెల్యూట్ గొట్టిండు.

"ఏం గావాలె సార్ " అని అడిగిండు.

"జల్ది మూడు కడక్ ఛాయ్‌లు బంపియ్యి" అని యాద్గిరి అన్నడు.

ఛాయ్‌లు బంపిచ్చెతందుకు గీయినకు నేనే దొర్కిన్నా. ఏ జమెదార్‌కు జెప్పినా ఛాయ్‌లు బంపిస్తడు అని మనసుల అనుకోని సిఐ అవుతలకు బోయిండు. జెరసేపైనంక గా సిఐ -

"సతీష్ సతీష్" అని బిల్సిండు.

గియ్యాల్ల జల్ది ఇంటికి బోయి పెండ్లాంతోని గల్సి సిన్మకు బోవాలె. ఏ సిన్మకు బోతె బాగుంటదని సోచాయిస్తున్న ఎస్ఐ సతీష్ సిఐని మనసుల దిట్టుకుంట వొచ్చిండు. సిఐకి సెల్యూట్ గొట్టిండు.

"ఏం జెయ్యాలె సార్" అని అడిగిండు.

"జల్ది డిఎస్పి సాబ్‌కు మూడు కడక్ ఛాయ్‌లు బంపియ్యి" అని అన్నడు.

గీయినేంది డిఎస్పికి ఛాయ్‌లు బంపిచ్చెతందుకు నేను ఉన్ననను కుంటున్నడా అని మనసుల అనుకోని ఎస్ఐ-

"మంచిది సార్" అన్నడు.

పావు గంట అయినంక ఎస్ఐ -

"రంగయ్యా! రంగయ్యా!" అని తీన్ పట్టి జమెదార్‌ను బిల్సిండు.

సరింగ గప్పుడే ఇద్దరు నెత్తులు బలగొట్టుకోని జమెదార్ తాన్కి వొచ్చింద్రు. గాల్లిద్దరి తాని కెల్లి ఎన్ని రూపాలు గుంజితె పడ్తల్ బడ్తదని జమెదార్ సోచాయిస్తుండు. ఎస్ఐ బిల్వంగనే జమెదార్‌కు సుర్రుమన్నది. యాల్లపాల్ల లేకుంటె ఎప్పుడు బడ్తె గప్పుడు గీయిన బిలుస్తుంటడు అని అనుకుంట గాడు వొచ్చిండు. ఎస్ఐకి కడక్ సెల్యూట్ గొట్టిండు.

"ఏం గావాలె సార్" అని అడిగిండు.

"డిఎస్పిసాబ్‌కు మూడు కడక్ ఛాయ్‌లు బంపియ్యి. గీడ ఉన్నట్లు రావాలె" అని ఎస్ఐ అన్నడు.


"మంచిది సార్" అని జమెదార్ అన్నడు.

గని గాడు ఛాయ్ జెప్పెతందుకు బోలేదు.

"మల్లేశ్. మల్లేశొ" అని ఏక్‌పట్టి జమెదార్‌ను బిల్సిండు.

గీల్లందరు నాకే పనులు జెప్తరు. జీతం నేనొక్కన్నే తీస్కుంటున్ననా? గీల్లు దీస్కుంటలేరా అని మనసులు అన్కుంట ఏక్‌పట్టి జమెదార్ వొచ్చిండు. తీన్ పట్టి జమెదార్‌కు సెల్యూట్ గొట్టిండు.

## భర్త....!?



ఒక నియంత సభలో ప్రసంగిస్తుండగా ఒక మహిళ "నీలాంటి నియంత నా భర్త అయ్యుంటే విషం ఇచ్చి చంపేదాన్ని" అని అన్నది. "నీలాంటి గయ్యాళి నా భార్య అయ్యుంటే నేనే విషం తాగి ఆత్మహత్య చేసుకునేవాణ్ణి" అని ఆ నియంత జవాబు ఇచ్చాడు.

"ఏం పని ఉన్నది సార్" అని అడిగిండు.

"జల్ది డిఎస్పి సాబ్‌కు మూడు కడక్ ఛాయ్‌లు బంపియ్యి" అని తీన్‌పట్టి జమెదార్ అన్నడు.

ఆపిస్ ముంగట ఉన్న ఛాయ్ బండి తాన్ని ఏక్‌పట్టి జమెదార్ బోయిండు.

"మా డిఎస్పిసాబ్‌కు జల్ది మూడు కడక్ ఛాయ్‌లు బంపియ్యి" అని ఛాయ్‌బండోనికి జెప్పిండు.

గీ పోలీసోల్లు పైసలియ్యరు పాడియ్యరు. ఫుక్యానికి ఛాయ్‌లు దాగుతరు అని మనసుల అనుకోని-

"మా పోరగాడు ఇంకోతానికి ఛాయ్‌లు దీస్కోని బోయిండు సార్. గాడు రాంగనే ఛాయ్‌లు బంపిస్త" అని ఛాయ్‌బండోడు అన్నడు.

యాద్గిరి ఛాయ్‌లు జెప్పి అద్దగంట అయ్యింది. గని ఛాయ్‌లు రాలేదు.

"మొన్న బజార్ల మనతోని గల్సి సద్దుకున్న రూప గల్సింది. యాద్గిరి ఏం జేస్తున్నడని అడిగింది" అని సత్నారి అన్నడు.

"సద్వుకునే దినాలల్ల గామెను బనాయించెటోడిని. మా పోరిని బనాయిస్తివా అంటె పోలీసోల్లకు బట్టిస్త అని ఒక పారి రూప నాయిన నన్ను బెదిరిచ్చిండు. గిప్పుడు నేనే డిఎస్పినైన అని ఎర్కైతె గాయిన ఏమనుకుంటడో" అని యాద్గిరి అన్నడు.

"మేము వొచ్చి నీ పని కరాబ్ జేస్తున్నట్లు గొడ్తున్నది. ఇగ మేము బోతంరా" అని నేను అన్న.

"ఛాయ్ దాగి బోంద్రిరా" అన్కుంట యాద్గిరి మల్ల సిఐని బిల్సిండు.

"ఛాయ్ జెప్పి అద్దగంటైంది. జల్ది ఛాయ్‌లు బంపియ్యి" అని అన్నడు.

సిఐ, ఎస్ఐని బిల్సిండు.

"ఛాయ్‌లు ఇంక రాలేదని డిఎస్పి సాబ్ గరమైతున్నడు. జల్ది ఛాయ్‌లు బంపియ్యి" అని సిఐ అన్నడు.

"గిప్పుడే బంపిస్త సార్" అని ఎస్ఐ అన్నడు.

ఎస్ఐ, తీన్‌పట్టి జమెదార్‌ను బిల్సిండు.

"ఛాయ్‌లు బంపియ్యమని నీకు జెప్పి అద్దగంట అయితున్నది. ఛాయ్‌లు బంపియ్యకుంట ఏం మాల్లు జేసున్నవు. జల్ది ఛాయ్‌లు బంపియ్యి" అని అన్నడు.

తీన్ పట్టి జమెదార్ ఏక్ పట్టి జమెదార్‌ను బిల్సిండు.

"డిఎస్పి సాబ్‌కు ఛాయ్‌లు బంపియ్యమంటె ఏం జేస్తున్నవు. ఆకర్కి ఛాయ్‌లు గూడ బంపియ్యరాకుంటె ఎట్ల. కొల్వుజెయ్యాలని ఉన్నదా లేదా?" అనుకుంట తీన్‌పట్టి జమెదార్ కోపంజేసిండు.

ఏక్‌పట్టి జమెదార్ ఛాయ్ బండోని తాన్కి బోయిండు.

"జల్ది ఛాయ్‌లు బంపియ్యకుంటివా అంటె నీ బండి లేకుంట జేస్త" అని ఛాయ్‌బండోన్ని బెదిరిచ్చిండు.

"పోరగాడు రాంగనే ఛాయ్‌లు బంపిస్తసార్" అని బండోడు అన్నడు.

గంటసేపైనంక గూడ ఛాయ్‌లు రాలేదు..


"ఇగ వొస్తంరా" అన్కుంట మేము లేసినిలబడ్డం

"ఛాయ్ దాగి బోంద్రిరా" అని యాద్గిరి అన్నడు.

"మీ ఇంటికి వొచ్చి ఛాయ్ దాగుతం తియ్యి" అన్కుంట మేము యాద్గిరి తానికెల్లి ఇంటికి బోయినం.

■

"సద్వుకునే దినాలల్ల గామెను బనాయించెటోడిని. మా పోరిని బనాయిస్తివా అంటె పోలీసోల్లకు బట్టిస్త అని ఒక పారి రూప నాయిన నన్ను బెదిరిచ్చిండు. గిప్పుడు నేనే డిఎస్పినైన అని ఎర్కైతె గాయిన ఏమనుకుంటడో" అని యాద్గిరి అన్నడు.



## నిన్నటి నుంచీ...



అలెగ్జాండర్ డ్యూమాస్

ప్రముఖ నాటక రచయిత అలెగ్జాండర్ డ్యూమాస్‌ను ఆయన మిత్రుడు తాను రాసిన నాటక ప్రదర్శనకు బలవంతంగా తీసుకుపోయాడు. నాటకం బోర్ కొట్టింది. కానీ డ్యూమాస్ ఆ మాట పైకి అనకుండా "ఆ కుర్చీలో అతగాడు ఎంత హాయిగా నిద్రపోతున్నాడో చూడు" అని నిద్రపోతున్న వ్యక్తిని తన మిత్రుడికి చూపించాడు.

మిత్రుడు కాస్త బాధపడ్డాడు. మరుసటిరోజు అదే వేదికమీద ప్రదర్శిస్తున్న తన నాటకానికి ఆ మిత్రుణ్ణి పిలిచాడు డ్యూమాస్. నాటకం చాలా బాగుంది కానీ డ్యూమాస్‌ను అవమానించాలనే ఉద్దేశంతో ఆ మిత్రుడు-

"చూడు, చూడు అతగాడు ఎంత హాయిగా నిద్రపోతున్నాడో!" అంటూ నిద్ర పోతున్న ఒక వ్యక్తిని చూపించాడు. డ్యూమాస్ నిద్రపోతున్న వ్యక్తిని చూసి "బలేవాడివే అతగాణ్ణి పోల్చుకోలేదా! నిన్న నీ నాటకం చూస్తూ నిద్రపోయినవాడే ఇంక లేవలేదు" అన్నాడు.